సాక్షి
ఖమ్మం
గురువారం । 25 । జనవరి । 2024



ఓటు హక్కు వజ్రాయుధం
మంచి చేసే నేతలను ఎన్నుకునేందుకు ఓటు హక్కు ప్రజలకు వజ్రాయుధంలా ఉపయోగపడుతోంది. 8లో



కేఎంసీలో అయోమయం
కేఎంసీలో పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించినా తిరిగి కార్యాలయానికి రావడంతో అయోమయం నెలకొంది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం
జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత కాస్త పెరిగే అవకాశముంది. ఉదయం, రాత్రి మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా బీఆర్క్ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన బీఆర్క్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, 1,071మంది విద్యార్థులకు గాను 1,041మంది హాజరయ్యారని పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించగా, విద్యార్థులందరికీ క్షుణ్ణంగా తనిఖీ చేశాక లోపలకు అనుమతించారు.

ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకం



డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ పాత్ర కీలకమని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం ఖమ్మం కొత్త, పాత బస్టాండ్లలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన డ్రైవర్లను సన్మానించి మాట్లాడారు. ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. కాగా, ఖమ్మం ఆర్టీసీ డిపోలో జరిగిన మరో కార్యక్రమంలో ఉత్తమ డ్రైవర్లను ఎంవీఐ వరప్రసాద్ సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదరహిత ప్రయాణమే అందరి లక్ష్యం కావాలని తెలిపారు. ఈ కార్యమాల్లో ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్, ఉద్యోగులు రామిశెట్టి రామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడో, రేపో పోలీస్ శాఖలో బదిలీలు

ఖమ్మంక్రైం: జిల్లా పోలీసు శాఖలో ఒకటి, రెండు రోజుల్లో భారీగా బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. మొదట ఎస్‌ఐలు, ఆ తర్వాత సీఐలు, ఏసీపీ స్థాయి అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. దీంతో పోలీస్ అధికారులు పలువురు అనువైన చోట పోస్టింగ్ దక్కించుకునేందుకు రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో నియమితులైన పోస్టుల్లో కొనసాగుతున్న ఉద్యోగుల్లో ఒకరిద్దరు తప్ప మిగతా వారికి స్థానచలనం తప్పదనే ప్రచారం జరుగుతోంది. ఖమ్మం కమిషనరేట్‌లో సీఐ స్థాయి అధికారులు దాదాపు అందరూ బదిలీ అవుతారని శాఖలో చర్చ మొదలైంది.

పెనుబల్లి ఆస్పత్రిలో కాయకల్ప బృందం



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు

పెనుబల్లి: పెనుబల్లిలోని ప్రభుత్వాస్పత్రిని కాయకల్ప బృందం బుధవారం తనిఖీ చేసింది. ఆస్పత్రిలో వైద్యసేవలు, పరిశుభ్రతపై ఆరా తీసిన వారు రికార్డులు పరిశీలించారు. పాల్వంచ ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన బృందం ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు డాక్టర్ ముక్కంటేశ్వరరావు తెలిపారు. ఈ బందంలో శారద, శారద తదితరులు ఉండగా పెనుబల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌బాబు, వైద్యులు రంజిత్‌కుమార్, నవీన్, వరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1న జేఎల్‌ఎం అభ్యర్థులకు పరీక్షలు


ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీ కోసం అభ్యర్థులకు ఫిబ్రవరి 1న పరీక్షలు నిర్వహించనున్నట్లు ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించడంతో పాటు స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈవిషయమై అభ్యర్థులకు పోస్ట్ ద్వారా సమాచారం ఇస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఊతమిస్తే.. మరింత ఊపు

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రదేశాలెన్నో..

- టెంపుల్ – ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశం
- సర్క్యూట్ ఏర్పాటుపై అధికారుల్లో కొరవడిన సమన్వయం
- ప్రణాళికతో పనిచేస్తే సందర్శకులు పెరిగే చాన్స్

ఓవైపు ప్రకృతి అందాలు, మరోవైపు ఆధ్యాత్మిక వాతావరణానికి ప్రతీకలైన ఆలయాలు, మందిరాలు.. ఈ రెండింటినీ మేళవిస్తూ టెంపుల్ – ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయానికి తగ్గట్టుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అపార అవకాశాలు ఉన్నాయి. ప్రకృతి, ఆధ్యాత్మికమే కాకుండా నల్ల బంగారు గనులు, సాగునీటి ప్రాజెక్టులు.. ఇలా ఆహ్లాదాన్ని పంచుతూ కనువిందు చేసే మరెన్నో సుందర దృశ్యాలు ఉమ్మడి జిల్లా సొంతం. అయితే వీటన్నింటినీ కలగలిపి టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసి పర్యాటకులకు చూపే వారు కరువయ్యారు. ఈ నేపథ్యాన నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలపై కథనం. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



కనువిందు చేసే కిన్నెరసాని..

పాల్వంచ మండల పరిధిలో కిన్నెరసాని నది, కిన్నెరసాని డ్యామ్‌తో పాటు అభయారణ్యం ఉన్నాయి. కిన్నెరసాని డ్యామ్ దగ్గర పర్యాటకులు బస చేసేందుకు కాటేజీలు కూడా ఉన్నాయి. బోటింగ్ సౌకర్యం ఉంది. కానీ ఇక్కడి ప్రకృతి అందాలు చూసేందుకు స్థానికులు తప్ప బయటి ప్రాంతాల నుంచి వచ్చే వారు తక్కువ. ఇక కొత్తగూడెంలోని చలమల్ల శ్రీనివాసరావు సెంట్రల్ పార్కులో అడ్వెంచర్ గేమ్స్‌కు అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న కొత్తగూడెం – పాల్వంచలో బస చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో అనేక గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లు అందుబాటులో ఉన్నాయి.

వెన్నెల జలపాతం

గోదావరి తీరం వెంట మణుగూరుకు సమీపంలో రావణాసురుడు బసచేసిన రథం గుట్ట ఉంది. ఈ గుట్టపైనే వెన్నెల జలపాతం ఉంది. గత ప్రభుత్వ హయాంలో రథం గుట్టను పర్యాటక ప్రాంతంగా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వెన్నెల జలపాతానికి ఎగువన గుట్టపై ఉన్న విశాలమైన మైదాన ప్రాంతంలో రివర్ ఫ్రంట్ – హిల్ వ్యూ కాటేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్ – ఖమ్మం జిల్లాల మధ్య టెంపుల్ – ఎకో టూరిజం సర్క్యూట్‌కు మధ్యలో మణుగూరు విడిదిగా ఉపయోగ పడుతుంది. దీంతో హైదరాబాద్ నుంచి కూడా భారీ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుంది. పెనుబల్లి సమీపాన పులిగుండాల ప్రాజెక్టు, అశ్వారావుపేటలోని పెదవాగు, చర్ల మండలంలో ఉన్న తాలిపేరు తదితర ప్రాజెక్టులను కూడా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

మరెన్నో ఆలయాలు, ప్రార్థనా స్థలాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలంతో పాటు ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, ఖమ్మం ఖిల్లా, జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఏన్కూరు మండలం నాచారంలో అద్భుత వేంకటేశ్వర స్వామి ఆలయం, ఇల్లెందు మండలం సత్యనారాయణపురంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే దర్గా, పెనుబల్లిలోని నీలాద్రీశ్వర ఆలయం, అన్నపురెడ్డిపల్లిలో శ్రీవేంకటేశ్వరాలయం, మల్లికార్జున స్వామి ఆలయాలు ఉన్నాయి. అశ్వారావుపేట పక్కనే ఏపీలో ప్రసిద్ధమైన గుబ్బలమంగమ్మ దేవాలయం ఉంది. వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

తోటల 'పేట'..

సారవంతమైన నేలలు, ఉద్యాన పంటలకు అనువైన వాతావరణం ఉన్న అశ్వారావుపేటను ఎకో టూరిజం హబ్‌గా మార్చేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. స్థానికులకు అశ్చర్యం కలిగించకపోయినా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఇక్కడ ఇబ్బడిముబ్బడిగా ఉన్న పామాయిల్, కోకో తోటలు కనువిందు చేస్తాయి. తెలంగాణలో అత్యధికంగా మామిడి, పామాయిల్, కొబ్బరి ఇతర మొక్కలు అందించే నర్సరీలు ఈ నియోజకవర్గంలో వందల సంఖ్యలో ఉన్నాయి. అశ్వారావుపేటకు సమీపంలో అన్నపురెడ్డిపల్లిలో శ్రీవేంకటేశ్వరాలయం, మల్లికార్జున స్వామి ఆలయాలు ఉన్నాయి. 'పేట' పక్కనే ఏపీలో ప్రసిద్ధమైన గుబ్బలమంగమ్మ దేవాలయం ఉంది. గుమ్మల మంగమ్మ దర్శనం – తోటల సందర్శన పేరుతో టెంపుల్ ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడ అవకాశముంది.

మైనింగ్ టూరిజం

బొగ్గు గనులకు ఉమ్మడి జిల్లా పుట్టినిల్లుగా ఉంది. ఇల్లెందు, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా బొగ్గు తవ్వకాలు జరుగుతున్నాయి. ఉత్పత్తి పూర్తయిన గనులను మూసివేశారు. గతంలో మైనింగ్ టూరిజం పేరుతో గోదావరిఖనిలో గనుల సందర్శన కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ – ఆర్టీసీ సంయుక్తంగా చేపట్టాయి. అదే తరహాలో భద్రాచలం – కిన్నెరసానికి వచ్చే పర్యాటకులకు మైనింగ్ టూరిజం పేరుతో ఇక్కడి భూగర్భ, ఉపరితల గనులను చూపించొచ్చు.

రామాయణ ఘట్టాల్లో కీలకం... భద్రగిరి

రామాయణ ఇతివృత్తంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలకు ప్రత్యేక అనుబంధం ఉంది. త్రేతాయుగంలో శ్రీరాముడు వనవాసం కోసం దట్టమైన అటవీప్రాంతంలోని గోదావరి తీరాన ఉన్న భద్రాచలం వచ్చాడని, పర్ణశాలలో కుటీరం ఏర్పాటు చేసుకుని కొంత కాలం ఉన్నాడని పురాణాలు చెబుతున్నాయి. ఆయన పేరుతోనే భద్రాచలం, పర్ణశాలలో శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయాలు ఉన్నాయి. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో రామాయణ ఇతిహాసాన్ని గుర్తుకు తెచ్చేలా యటపాక (జటాయువు), రేఖపల్లి, దుమ్ముగూడెం వంటి ప్రదేశాలు ఉన్నాయి. ఇక పాపికొండల అందాలు చూసేందుకు వెళ్లే పర్యాటకులకు భద్రాచలం గేట్‌వేగా ఉంది.

సంయుక్త కార్యాచరణ కరువు

టెంపుల్ – ఎకో టూరిజం ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నా అన్నింటినీ కలిపి టూర్ ప్లాన్ చేసే వ్యవస్థ లేకుండా పోయింది. దేవాదాయ, అటవీ , పర్యాటక శాఖలు ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. సరైన ప్రణాళికతో పనిచేస్తే భద్రాచలం వచ్చే భక్తులు పర్ణశాల, పాపికొండలు, కిన్నెరసాని అభయారణ్యం, సెంట్రల్ పార్క్, వెన్నెల, పులిగుండాల వంటి జలపాతాల సందర్శనతో కూడిన ప్యాకేజీలు ప్రకటిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు చర్యలు లేవు. కొత్త ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించిన నేపథ్యాన అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తే జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అడుగులు పడనున్నాయి.

బీఆర్‌ఎస్ పార్టీ బంగాళాఖాతంలోకే..

- మా ఎమ్మెల్యేలను కొనే శక్తి ఎవరికీ లేదు
- అర్హులకు పథకాలు అందేలా కార్యకర్తలు కృషిచేయాలి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని.. ఒకవేళ తాము గేట్లు తెరిస్తే ఆ పార్టీ బంగాళాఖాతంలో కలవడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఖమ్మం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం ఏర్పాటు చేయగా మంత్రి మాట్లాడారు. ఎమ్మెల్యేలను కొంటాం, కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని బీఆర్‌ఎస్ నేతలు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అయితే, తమ ఎమ్మెల్యేలను కొనే శక్తిసామర్థ్యాలు వారికి లేవన్నారు. గత పదేళ్లు అధికారం లేకపోయినా నిర్బంధాలు, అక్రమ కేసులను ఎదుర్కొంటూ కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలు అభినందనీయులన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయాన ఏజెంట్లు ఉండొద్దని ప్రలోభాలకు గురిచేసినా ప్రత్యర్థి దిమ్మ తిరిగేలా 50వేల పైచిలుకు మెజార్టీతో తనను గెలిపించిన కార్యకర్తలకు రుణపడి ఉంటానని ఆయన భావోద్వేగంతో తెలిపారు. కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని, వారి అనుమతి లేకుండా కొత్త వారిని పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. కాగా, గత ప్రభుత్వం మాదిరి అవినీతి జరగకుండా నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు చేరేలా కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు మహ్మద్ జావీద్, దొబ్బల సౌజన్య, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, నాగండ్ల దీపక్‌చౌదరి, షేక్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలి

ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామ

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన కార్యకర్తలు క్షేత్రస్థాయిలో నిలిచి బీఆర్‌ఎస్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ నామ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి బీఆర్‌ఎస్ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ నిధులు, ప్రాజెక్టులపై కేంద్రాన్ని నిలదీస్తామని తెలిపారు. అలాగే, పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి పార్టీ శ్రేణులను కలవనున్నట్లు ఎంపీ చెప్పారు. అనంతరం ఎంపీ నామ నాగేశ్వరరావును పలువురు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో వైరా మాజీ ఎమ్మెల్యే రాములునాయక్, నాయకులు తాళ్లూరి జీవన్, దండా పుల్లయ్య, బెల్లం వేణుగోపాల్, బాణాల వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రియాదవ్, పోట్ల శ్రీను, చిరంజీవి, చెరుకుమల్లి రవి, మాలోత్ శకుంతల, కిషోర్, బోయినపల్లి సుధాకర్, వాచేపల్లి లక్ష్మారెడ్డి, చేబ్రోలు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ ఇచ్చేయాల్సిందే..

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



రేషన్ దుకాణంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: పౌరసరఫరాల శాఖ కమిషనర్ సూచనల మేరకు మిల్లర్లు ఈనెల 31వ తేదీలోగా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం, నేలకొండపల్లి మండలంలోని రాయగూడెం, ముదిగొండ మండలం అమ్మపేటతో పాటు కొణిజర్లలోని రైస్ మిల్లులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా మిల్లులకు కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు అందించిన సీఎంఆర్ వివరాలు తెలుసుకున్న ఆయన లక్ష్యం మేరకు 31వ తేదీలోగా అందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బినామీ డీలర్లపై చట్టరీత్యా చర్యలు

చింతకాని: రేషన్ దుకాణాలను అసలు డీలర్లు కాకుండా బినామీలు నడిపిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ హెచ్చరించారు. చింతకానిలోని రేషన్ దుకాణాలను బుధవారం తనిఖీచేసిన ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాన్ని డీలర్ లేదా వారి కుటుంబసభ్యులు మాత్రమే నడిపించాలని స్పష్టం చేశారు. కాగా, జిల్లాలో లబ్ధిదారుల ఈ–కేవైసీ 73 శాతం పూర్తయినందున, వంద శాతం పూర్తయ్యేలా డీలర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చంద్రకుమార్, డీటీలు విజయ్‌బాబు,వీరభద్రనాయక్, డీలర్లు పాల్గొన్నారు.

మార్కెట్‌లో అదే దోపిడీ

- మిర్చి విక్రయాలు పెరుగుతున్న వేళ ధరలో కోత
- జెండా పాటతో పోలిస్తే రూ.3వేలకు పైగానే తక్కువ
- వ్యాపారుల తీరుతో రైతుల్లో అయోమయం



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: మిర్చి పంట విక్రయాలు పెరిగేకొద్దీ ఆ ప్రభావం ధరపై పడుతోంది. వ్యాపారుల కళ్ల ఎదుట పంట భారీగా కనపడగానే ధర తగ్గించడం సర్వసాధారణంగా మారింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది. మార్కెట్‌కు రైతులు భారీగా మిర్చి తీసుకురావడంతో ఇదే అదునుగా వ్యాపారులు ధర తగ్గించారు. మంగళవారం క్వింటా మిర్చికి జెండాపాట ధర రూ.21,500 పలకగా, బుధవారం రూ.21వేలుగానే నమోదైంది. అంటే జెండా పాటలతోనే రూ.500 ధర తగ్గించగా.. నాణ్యత పేరిట మరింత కోత విధించారు. తేమ, మచ్చ, తాలు తదితర కారణాలు చెబుతూ క్వింటారూ.16 వేల నుంచి రూ.19 వేల మధ్యలోనే కొనుగోలు చేశారు.

భారీగా సరుకు

పంట కోతలు పెరుగుతున్న కొద్దీ మిర్చి విక్రయాలు కూడా ఊపందుకుంటున్నాయి. మొదటి కోతతో పాటు ప్రస్తుతం రెండో కోత పంటను రైతులు ఖమ్మం మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. బుధవారం మార్కెట్‌కు 32,406 బస్తాల మిర్చి తీసుకురాగా, ఇందులో ఎర్రమిర్చి 26,906 బస్తాలు, తాలు మిర్చి 5,500 బస్తాలు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఇంత సరుకు రావడం ఇదే ప్రథమమని అధికారులు వెల్లడించారు. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు సైతం ఖమ్మం మార్కెట్‌కు మిర్చి తీసుకొస్తున్నారు.

పొంతన లేని ధర

ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధరలు పొంతన లేకుండా నమోదవుతున్నాయి. జెండాపాటలో పలికిన ధరతో పోలిస్తే చెల్లించే ధరకు భారీ వ్యత్యాసం ఉంటోంది. పంట నాణ్యతగా ఉన్నా జెండాపాట కన్నా రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు వ్యాపారులు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కొనుగోలు చేసేది లేదని దబాయిస్తుండడంతో చేసేదేం లేక రైతులు అమ్ముతున్నారు. ఖమ్మం మార్కెట్‌లో బుధవారం తేజా రకం మిర్చికి జెండా పాట రూ.21వేలు పలకగా, అధికంగా రూ.18,500 ధరతోనే కొనుగోలు చేశారు. ఇక తక్కువ నాణ్యత, తేమ కొంత ఎక్కువగా ఉన్న మిర్చికి రూ.14 వేలు మించి చెల్లించలేదు. అలాగే, తాలు మిర్చికి గరిష్టంగా రూ.11,500, కనిష్టంగా రూ.6,400 ధర పలికింది.

ఎస్సెస్సీలో వంద శాతం ఫలితాలే లక్ష్యం



కొణిజర్ల : పల్లిపాడు పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

కొణిజర్ల/కల్లూరు రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. కొణిజర్ల మండలం పల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బస్‌స్టేషన్ ప్రాథమిక పాఠశాలలతోపాటు కల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన డీఈఓ వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుజాత, కనకపల్లి, పద్మావతి, ఎల్లారెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాత మున్సిపాలిటీలోకి జిల్లా లైబ్రరీ కార్యాలయం

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాన్ని ఖమ్మం పాత మున్సిపాలిటీ భవనంలోకి మార్చారు. పెవిలియన్ గ్రౌండ్ పక్కన ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం ఈనెల 12వ తేదీన కూలిపోగా కలెక్టర్ ఆదేశాల మేరకు పాత మున్సిపాలిటీ మొదటి అంతస్తులోని రెండు గదులు కేటాయించారు. ఆయా గదుల్లో గ్రంథాలయ సంస్థ కార్యాలయం నిర్వహణకు ఏ.మంజువాణి ఆధ్వర్యాన ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, లైబ్రరీని మాత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తుండగా ఇప్పుడిప్పుడే పాఠకులు వస్తున్నారు.

'ప్రియదర్శిని'లో టెక్నో, కల్చరల్ ఫెస్ట్

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పెదతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 26, 27వ తేదీల్లో జాతీయ స్థాయి టెక్నో, కల్చరల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల అధినేత కె.నవీన్ తెలిపారు. ఈసందర్భంగా ఫెస్ట్ పోస్టర్లను అధ్యాపకులతో కలిసి బుధవారం ఆవిష్కరించిన ఆయన వివరాలు వెల్లడించారు. పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, షార్ట్ ఫిల్మ్, వ్యాసరచన, నృత్యం, సంగీతం, ఫ్యాషన్‌షో తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు వి.రామారావు, ఎం.వెంకటేశ్వరరావు, నర్సింహారావు, రమేష్, కుమారస్వామి, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

మారథాన్‌లో బంగారు పతకం


రాజును సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మంక్రైం: ఇటీవల ముంబైలో జరిగిన మారథాన్‌లో పాల్గొన్న ఖమ్మం సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ పిల్లి రాజు బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను అధికారులు సన్మానించారు. ఈకార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ శంకర్, సీఐ శివకుమార్, ఎస్‌ఐలు రంజిత్, విజయ్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కామేపల్లి: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. తల్లాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కె.నరసింహారావు బుధవారం కొత్తలింగాల నుంచి కొత్తలింగాల స్టేజీ వైపు వెళ్తుండగా మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న బరగడి మధు, ఆయన తల్లి అనపూర్ణకు గాయాలు కాగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆభరణాలతో కూడిన బ్యాగ్ చోరీపై కేసు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ప్రయాణికురాలి వద్ద బంగారు, వెండి ఆభరణాలతో కూడిన బ్యాగ్ చోరీ జరగగా సత్తుపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన ఆంగోతు లలిత ఈనెల 22న సత్తుపల్లి నుంచి అశ్వారావుపేటకు ఆర్టీసీ బస్సులో వెళ్తోంది. అశ్వారావుపేట బస్టాండ్‌లో దిగాక చూస్తే బ్యాగ్‌లోని రూ.17.73 లక్షల విలువైన ఆభరణాలు సహా రూ.11వేల నగదు కనిపించలేదు. దీంతో ఆమె సత్తుపల్లిలో పోలీసులను ఆశ్రయించగా బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ జె.మోహన్‌బాబు తెలిపారు.

ఆలయం హుండీలో చోరీ

కల్లూరురూరల్: కల్లూరు మండలం చెన్నూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీలో ఉన్న సుమారు రూ.10 వేల నగదు అపహరించారు. ఘటనపై ఆలయ కమిటీ సభ్యుడు ఎ.భాస్కర్‌రావు ఫిర్యాదుతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- నిందితుల్లో భద్రాద్రి జిల్లా కానిస్టేబుల్

రేగొండ: ఎండు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. భూపాలపల్లి సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ సీఐ పులి వెంకట్, రేగొండ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యాన భూపాలపల్లి జిల్లా రేగొండలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించగా తనిఖీ చేయడంతో మూడు కిలోల ఎండు గంజాయి లభించింది. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బంజర గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ పోడియం రమేష్, ఆటో డ్రైవర్లు ఉప్పు సాయి, కణతి రమణ ఉండగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకట్ తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,448

ఓటు హక్కు వజ్రాయుధం

- నమోదుకు నిరంతరాయంగా అవకాశం
- 18ఏళ్లు నిండినవారంతా అర్హులే..

నేడు జాతీయ ఓటరు దినోత్సవం



ఖమ్మంసహకారనగర్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం. ప్రతీ వ్యక్తి ఓటరుగా నమోదు చేసుకోవడంతో మంచి చేసే వారిని ఎన్నుకునేందుకు ఓటు వేయడాన్ని బాధ్యతగా భావించాలి. ఓటు హక్కు వినియోగించుకోకపోయినా, సరైన వ్యక్తులకు ఓటు వేయకున్నా ప్రజాస్వామ్యానికి చేటు చేసినట్లవుతుంది. ఈమేరకు అర్హులందరూ ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవడమే కాక స్వచ్ఛగా ఓటు వినియోగించుకునేలా కేంద్రం ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2011 ఏడాది నుంచి ఈ కార్యక్రమం మొదలైంది.

జిల్లాలో పది నియోజకవర్గాలు

అర్హులైన పౌరులందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం నిరంతరాయంగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, గుర్తింపు కార్డుల పంపిణీని చేపడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈనెల 6వ తేదీన విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 21,79,390గా ఉండగా, ఇందులో పురుషులు 10,63,259మంది, మహిళలు 11,16,000 మందితో పాటు ఇతరులు 131మంది ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలో 3,23,128మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా భద్రాచలం నియోజకవర్గంలో 1,49,267మంది ఓటర్లు ఉన్నారు. కాగా, ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 52,741 మంది ఎక్కువగా ఉండడం విశేషం.

ఆధునిక సాంకేతికత అందుబాటులోకి

భారత ఎన్నికల సంఘం ఓటింగ్ విధానంలో ఎప్పటికప్పుడు మార్పులకు శ్రీకారం చుడుతోంది. సుమారు ఐదేళ్ల నుంచి సాంకేతిక పరిజ్ఞానానికి అందుబాటులోకి తీసుకొచ్చింది. పోలింగ్ కోసం ఈవీఎంలను అందుబాటులో తీసుకురాగా, ఆపై వీవీప్యాట్లనూ ప్రవేశపెట్టారు. తద్వారా ఎవరికి ఓటు వేశామో తెలుసుకునే అవకాశం కల్పించింది. ఈవీఎం యంత్రంలో నోటా బటన్‌ను కూడా ప్రవేశపెట్టగా బరిలో నిలిచిన అభ్యర్థులెవరూ ఇష్టం లేకపోయినా తిరస్కరించేందుకు వెసలుబాటు వచ్చింది.

విస్తృత ప్రచారం

జిల్లాలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాలల్లో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో బీఎల్ఓల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. తద్వారా అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో సీనియర్ సిటిజన్లను సన్మానించడంతో పాటు కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి గుర్తింపు కార్డులు అందించనున్నారు. ఆతర్వాత ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తారు. అలాగే, కలెక్టరేట్ ఆవరణలో సైతం ఉద్యోగులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించేందుకు ఏర్పాట్లు చేశారు.

దరఖాస్తులిలా..

ఈనెల 6వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించారు. అనంతరం కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరించగా ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కలిపి 70,819 దరఖాస్తులు అందాయి. అందులో ఓటరు నమోదు కోసం 20,644, తొలగింపునకు 19,184 దరఖాస్తులు, చిరునామా మార్పు కోసం 30,971 దరఖాస్తులు ఉన్నాయి. వీటి పరిశీలన అనంతరం ఫిబ్రవరి 8వ తేదీన ఓటర్ల తుదిజాబితా ప్రచురిస్తారు.

ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,55,015	1,68,064	49	3,23,128
కొత్తగూడెం	1,19,150	1,26,127	31	2,45,308
సత్తుపల్లి	1,18,807	1,24,311	12	2,43,130
పాలేరు	1,14,025	1,12,405	06	2,26,436
మధిర	1,07,264	1,14,444	09	2,21,717
ఇల్లెందు	1,08,660	1,12,625	02	2,21,287
పినపాక	98,611	1,01,583	04	2,00,198
వైరా	93,628	98,786	07	1,92,421
అశ్వారావుపేట	76,367	80,124	07	1,56,498
భద్రాచలం	71,732	77,531	04	1,49,267
మొత్తం	10,63,259	11,16,000	131	21,79,390



కేఎంసీలో అయోమయం..

- ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపుతో అధికారులపై ఒత్తిడి
- విధులకు రావొద్దన్నా వచ్చిన సిబ్బంది
- ఇంకొందరి విభాగాలు మార్చిన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పలువురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించకుండానే రాజకీయ పలుకుబడితో కాలం వెళ్లదీస్తుండగా... చర్యలు మొదలయ్యాయి. తాజాగా ఆరుగురిని అధికారులు మంగళవారం తొలగించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ చేపట్టడంతో పాటు విధులకు గైర్హాజరవుతున్న వారికి ఫోన్ చేసి ఇకపై రావొద్దని సూచించారు. అయితే, ఈ ఆరుగురిలో కొందరు బుధవారం కార్యాలయానికి వచ్చి ఆయా విభాగాల్లో కూర్చున్నట్లు సమాచారం. అధికారులు రావొద్దని స్పష్టం చేసినా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కార్యాలయానికి రావడంతో ఏం జరుగుతుందో తెలియక ఉద్యోగుల్లో అయోమయం నెలకొంది. కాగా, తనకు సమాచారం ఇవ్వకుండా సిబ్బందిని ఎలా తొలగిస్తారంటూ మేయర్ అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. ఏదిఏమైనా అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు కేఎంసీ పాలకుల తీరుతో అధికారులపై ఒత్తిడి పెరుగుతోందని చెబుతున్నారు. అక్రమంగా నియామకమై విధులు నిర్వర్తించని వారిని తొలగించాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు పట్టుబడుతుండగా, తమ వద్ద పని చేసే సిబ్బందిని సమాచారం లేకుండా ఎలా తొలగిస్తారని మేయర్ ప్రశ్నించినట్లు సమాచారం. ఇక ఖాళీగా ఉన్న ఒకరిద్దరు సిబ్బందిని కమిషనర్ ఇతర విభాగాలకు కేటాయించారు.

సిబ్బంది హాజరుపై చర్చ..

ఇప్పటివరకు విధులకు హాజరు కాకుండా, ఏ పని చేయకుండా ఖాళీగా కూర్చుంటున్న ఆరుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని బుధవారం నుండి కార్యాలయానికి అధికారులు సూచించారు. అయితే, ఏనాడు కార్యాలయానికి వారు బుధవారం రావడం గమనార్హం. కాగా, రాజకీయ పలుకుబడితోనే వారు అధికారుల మాట కాదని కార్యాలయానికి వచ్చినట్లు చర్చ జరుగుతోంది. కాగా, 34 మందిని అక్రమంగా ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించగా, విచారణ చేసి పనిచేయని వారిని తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఈ అంశంపై కేఎంసీ కమిషనర్‌ను వివరణ కోరగా.. హాజరు తక్కువగా ఉండి, విధులకు సక్రమంగా హాజరు కాని నలుగురు సిబ్బందిని పక్కన పెట్టినట్లు తెలిపారు.

కమిషనర్ వద్దే ఎస్టాబ్లిస్‌మెంట్ విభాగం

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరిని బదిలీ చేశాక ఆమె పర్యవేక్షించిన విభాగాలను ఇన్నాళ్లు ఎవరికీ కేటాయించలేదు. ఈనేపథ్యాన ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంతో పాటు జనన, మరణ ధ్రువీకరణ విభాగాలను తన వద్దే ఉంచుకున్న కమిషనర్.. శానిటేషన్ విభాగాన్ని అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి అప్పగించారు. కాగా, సిబ్బంది నియామకాల్లో ఆరోపణలు రావడంతో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాన్ని కమిషనర్ ఎవరికీ కేటాయించలేదని తెలుస్తోంది.

ఎంపీ రవిచంద్ర జన్మదిన వేడుకలు


ఎంపీలు రవిచంద్ర, నామాను సత్కరిస్తున్న అభిమానులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీకి ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, మున్నూరు కాపు సంఘం నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలపగా, అనంతరం జరిగిన సమావేశానికి మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ రవిచంద్ర రాజ్యసభలో తెలంగాణ ప్రజల గొంతు బలంగా వినిపిస్తున్నారని తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, జర్నలిస్టు సంఘాల బాధ్యులు ఆకుతోట ఆదినారాయణ, రామనారాయణతో పాటు పార్టీల నాయకులు, అసోసియేషన్ల బాధ్యులు పోటు రంగారావు, వి.ప్రకాశ్, గుండాల కృష్ణ, ఉప్పల వెంకటరమణ, శీలంశెట్టి రమావీరభద్రం, కాపు కృష్ణ, రాపర్తి శరత్, లింగాల రవికుమార్, తోట రామారావు, గోళ్ల చంద్రకళ, మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, దిండిగల రాజేందర్, ఎడవల్లి కృష్ణ, వేములపల్లి వెంకటేశ్వరరావు, పి.ఉషాకిరణ్, నానబాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు


రాజుపాలెంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, నారాయణపురం తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించింది. ఈమేరకు సమాచారం అందుకున్న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ భద్రు, బి.అంజయ్య బుధవారం పరిశీలించారు. అనంతరం వారు రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పురుగు నివారణకు క్లోరాన్ట్రనిలిపోల్ మందు 80 ఎం.ఎల్. లేదా స్పైనటోరం మందు లీటర్‌ను 200 లీటర్ల నీటికి కలిపి ఎకరాలో పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పంట మోకాలు ఎత్తులో ఉన్నప్పుడు 9 భాగాలు ఇసుక, ఒక భాగం సున్నం కలిపి సుడుల్లో వేయాలని తెలిపారు. అలాగే, పూత సమయాన యూరియాతో పాటు పొటాష్ ఎరువు వేస్తే మొక్కజొన్న గింజల నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు టి.ఛాయారాజ్, కె.విజయభాస్కరరెడ్డి, సర్పంచ్ బూసిపల్లి వెంకటరెడ్డితో పాటు వెన్నపూస కృష్ణారెడ్డి, జిష్ణు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకూ హక్కులు

ఖమ్మం లీగల్: బాలికల రక్షణం కోసం చట్టాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లాలోని పలు పాఠశాలల్లో బుధవారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడమే కాక ఉచిత న్యాయ సాయం అర్హత, ప్రయోజనాలను వివరించారు. అలాగే, రాజ్యాంగం కల్పించిన హక్కులు, వారితో ఎవరైనా అసౌకర్యంగా ప్రవర్తిస్తే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందే న్యాయసాయాన్ని తెలిపారు. పారా లీగల్ వలంటీర్లు మాధవీలత, పద్మ ,మానస, మధు, సునీత, రుక్మిణి, శంకర్‌రావు, సత్యవతి, విద్యాసాగర్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

మద్దులపల్లి వసతిగృహంలో..

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి ఎస్సీ బాలికల వసతి గృహంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో జిల్లా సంక్షేమ అధికారి టి.సుమ మాట్లాడుతూ బాల్య వివాహాలను వ్యతిరేకించాలని, ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో జీసీడీఓ భూలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ భారతిరాణి, సీడీపీఓలు దయామణి, కృష్ణకుమారి, బాలత్రిపురసుందరి, పీ.వీ.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

షిర్డీలో నాట్య ప్రదర్శన


నాట్యం చేస్తున్న చిన్నారులు

ఖమ్మంగాంధీచౌక్: మహారాష్ట్రలోని షిర్డీ సాయి బాబా సన్నిధిలో ఖమ్మం నగరానికి చెందిన చిన్నారులు నాట్య ప్రదర్శన ఇచ్చారు. షిర్డీలోని నేత్రాలయ నాట్యాలయం ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హార్వెస్ట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు జి.వైశాలి, బాలబోయిన రాధ్యా, జి.త్రిషిక, నున్నా యశిత పాల్గొన్నారు. వీరి వెంట నాట్య గురువు ప్రణీల్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు


తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఏసీపీ

ఖమ్మంక్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఆయన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతిరోజు తనిఖీలు ఉంటాయని.. సైలెన్సర్లు మార్చినా, నంబర్ ప్లేట్ లేకున్నా కేసులు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 253మంది పట్టుబడగా మొదటిసారైతే కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టుకు పంపిస్తున్నామని పేర్కొన్నారు. తరచు పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా రవాణా శాఖ అధికారులకు లేఖ రాస్తున్నామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగితే కుటుంబాలు ఎలా బాధపడతాయో వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని ఏసీపీ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మధిరరూరల్: మండలంలోని దెందుకూరు సమీపాన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జయంతి గ్రామానికి చెందిన గూడూరు శ్రీనివాస్‌రెడ్డి(38) తాపీ పనుల నిమిత్తం పెనుగంచిప్రోలుకు వచ్చి ఇంటికి వెళ్లేందుకు మధిర చేరుకున్నాడు. అక్కడి నుంచి జయంతి గ్రామానికి ఆటోలో వెళ్తుండగా దెందుకూరు సమీపాన ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకువెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన లారీడ్రైవర్ మృతి

రఘునాథపాలెం: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై రఘునాథపాలెం సీఐ శ్రీధర్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దొనబండకు చెందిన లారీడ్రైవర్ మురళి ఈనెల 21న రాత్రి రఘునాథపాలెం నుంచి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. బీరోలుకు చెందిన రేక వెంకటేశ్వర్లు(47) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఒంటరిగా గ్రామానికి వచ్చిన ఆయన బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని కనిపించాడు. కాగా, ఆయన కాళ్లు పూర్తిగా భూమిపై ఉండడం, ఉరి వేసుకున్న తాడు ముడి సరిగా లేకపోవడంతో ఎవరైనా హత్య చేసి ఉరిగా చిత్రీకరించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ వరాల శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఈ ఘటనపై విచారణ చేస్తామని తెలిపారు. కాగా, వెంకటేశ్వర్లు భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విడిపోయిన గూడ్స్ రైలు బోగీలు

చింతకాని: మండలంలోని చింతకాని - నాగులవంచ రైల్వేస్టేషన్ల మధ్య విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న గూడ్స్ రైలు బోగీలు విడిపోయాయి. ఈవిషయాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది బోగీలను తిరిగి కలపగా గూడ్స్ ముందుకు కదిలింది. అయితే, ఈ ఘటనతో ఖమ్మం వైపు వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను మధిర, బోనకల్ స్టేషన్లలో నిలిపివేశారు. మరోపక్క నాగులవంచ రైల్వే గేట్‌లో గూడ్స్‌బోగీలు నిలిచిపోవడంతో పాతర్లపాడు, నాగులవంచ గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

రుణబకాయి చెల్లించకపోవడంతో కార్లు సీజ్

ఖమ్మంవ్యవసాయం: వాహన రుణాల బకాయిలు చెల్లించకపోవడంతో ఇద్దరి కార్లను డీసీసీబీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఖమ్మంకు చెందిన మాజీ కార్పొరేటర్ కాంపాటి వెంకన్న భార్య సరిత పేరిట 2018 ఫిబ్రవరి 2న రూ.6,44,200 రుణం తీసుకున్నారు. ఇందులో రూ.5.10లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇక భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ బోజెల్ల వెంకటరామయ్య 2017 మార్చి 8న రూ.3.20లక్షల రుణం తీసుకోగా వడ్డీతో సహా రూ.3.50లక్షలు బకాయి ఉంది. దీంతో వీరిద్దరి కార్లను బుధవారం సీజ్ చేసి డీసీసీబీ కార్యాలయానికి తరలించినట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ పద్మావతి తెలిపారు.

వంతెనపై నిలిచిన లారీ.. స్తంభించిన ట్రాఫిక్


రహదారిపై నిలిచిన వాహనాలు

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన మీద సాంకేతిక లోపంతో భారీ లోడ్‌తో వెళ్తున్న లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వైరా నుండి తల్లాడ వెళ్తున్న లారీ హైలెవల్ వంతెనపై ఆగిపోయింది. దీంతో ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలు లేక జాతీయ రహదారికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర గంట పాటు నిలిచిపోయాయి. ఈమేరకు వైరా పోలీసులు చేరుకుని లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నదిలో మునిగి వ్యక్తి మృతి

మధిర: మధిరలోని మృత్యుంజయ స్వామి ఆలయ సమీపాన వైరా నదిలో మునిగిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మూడు రోజుల క్రితం జరిగినట్లు తెలుస్తుండగా మృతదేహం బుధవారం బయటపడింది. మధిర మండలం తొర్లపాడుకు చెందిన షేక్ ఇస్మాయిల్(70) తన భార్యతో కలిసి పదేళ్లుగా మధిరలో నివసిస్తున్నాడు. మూడు రోజులుగా ఆయన ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. ఇంతలోనే బుధవారం వైరా నదిలో మృతదేహం తేలగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మధిర టౌన్ ఎస్‌ఐ రాజేష్ చేరుకుని ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించగా ఇస్మాయిల్‌దిగా గుర్తించారు. ఆయన ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అనేది తేలాల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నేలకొండపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అయితే, పోలీసులను చూసిన మరో ఇద్దరు డ్రైవర్లు వాహనాలతో సహా పారిపోయారు. ముదిగొండ మండలం నుంచి బుధవారం మూడు ట్రాక్టర్లలో అనుమతి లేకుండా నేలకొండపల్లికి ఇసుక తరలిస్తున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన స్థానికులు అడ్డుకుని నేలకొండపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, పోలీసులు వచ్చేలోగా అక్రమార్కులు రెండు ట్రాక్టర్లతో పారిపోగా ఒక ట్రాక్టర్‌ను అప్పగించారు. కాగా, ఇసుక రవాణాలో మధ్యవర్తుల నడుమ వివాదం కారణంగా పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ బ్లీడింగ్‌ను అరికట్టడానికి 'హేమోస్ప్రే'

ఇండియాలో తొలిసారి ఈ సాంకేతికతను ఉపయోగించిన ఏఐజీ హాస్పిటల్స్



సాక్షి, హైదరాబాద్: గ్యాస్ట్రోఇంటెస్టైనల్ (జీఐ) రక్తస్రావం ఆపడానికి హేమోస్ప్రే టెక్నాలజీని మనం దేశంలో మొట్టమొదటిసారిగా ఏఐజీ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు ఉపయోగించారు. ఈ ప్రత్యేకమైన ఎండోస్కోపిక్ స్ప్రే 10 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలోనే అంతర్గత రక్తస్రావాన్ని ఆపి, ప్రమాదస్థితి నుంచి కాపాడుతుందని ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ సాంకేతికత గురించి ఆయన మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ఇది చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. హేమోస్టాసిస్ (రక్తస్రావం ఆపే ప్రక్రియ) కోసం ఖనిజ మిశ్రమం పొడితో తయారుచేసిన ఈ హేమోస్ప్రే బాగా పని చేస్తుం దన్నారు. ఈ స్ప్రే జీర్ణాశయం భద్రత, సమర్థతను పెంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. అన్నవాహిక, కడుపులోని జీర్ణాశయాంతర పేగుల్లో రక్తస్రావం తీవ్రమైన రక్త నష్టానికి దారితీస్తుందని, ఈ పరిస్థితికి తమ ఆధునిక టెక్నాలజీ చెక్ పెడుతుందని తెలిపారు. హేమోస్ప్రేను మొదటిసారిగా లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతున్న 49 ఏళ్ల మహిళా పేషెంట్‌పై డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మోహన్ రాంచందాని ప్రయోగించారు.

బీసీ కులాల పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన తర్వాత తమ కులాలను ఓబీసీ జాబితా నుంచి తప్పించారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. విభజన అనంతరం తెలంగాణకు చెందిన సుమారు 28 వెనకబడిన కులాలు రిజర్వేషన్ల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నాయంటూ దాఖలైన పలు పిటిషన్లు బుధవారం జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. సుప్రీంకోర్టులో రాష్ట్ర న్యాయవాదుల ప్యానెల్ మారిందని, అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని ఈ నేపథ్యంలో మూడు వారాలు గడువు ఇవ్వాలని తెలంగాణ తరపు న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మూడు వారాలపాటు విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

అంతరాలపై విద్యాయుద్ధం

పేదరికానికి నాణ్యమైన విద్యే సరైన మందు - ఇండియా టుడే సదస్సులో ఏపీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'పేదరిక నిర్మూలన నాణ్యమైన చదువు ద్వారానే సాధ్యమని నేను నమ్ముతాను. అది ప్రతి ఒక్కరి హక్కు కావాలి. పేద పిల్లలు తెలుగు మీడియంకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. సంపన్నులకు అందే నాణ్యమైన చదువులు పేద పిల్లలకూ అందాలన్నదే మా లక్ష్యం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో జరుగుతున్న ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమంలో బుధవారం సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ఓ ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పారు. పిల్లలు ఓటర్లు కాదు కాబట్టి వారి గురించి ఎవరూ పట్టించుకోరని, ఇది దురదృష్టకరమని అన్నారు. అయితే పిల్లలు మంచి విద్యావంతులైతేనే, వారికి నాణ్యతతో కూడిన విద్యను అందిస్తేనే.. సమాజంలో దారిద్ర్యం పోతుందని నొక్కి చెప్పారు. పది మంది నిరుపేద విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమెరికాకు పంపించడమే కాకుండా వైట్‌హౌస్‌కు కూడా తీసుకెళ్లడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణలు, పథకాలు చాలా ఆకర్షిస్తున్నాయని ఈ సందర్భంగా రాజ్‌దీప్ అభినందించారు. రాజ్‌దీప్, సీఎం వైఎస్ జగన్ మధ్య జరిగిన సంభాషణ వివరాలు ఇలా ఉన్నాయి.

రాజ్‌దీప్ సర్దేశాయ్ : విద్యా రంగంలో ఇంత మంచి చేస్తున్నా, ప్రచారానికి ఎందుకు దూరంగా ఉంటారు?

సీఎం జగన్: ఇండియా టుడే జర్నలిస్టులు ఇక్కడి స్కూల్స్ సందర్శించి, అభివృద్ధి పనులు స్వయంగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది. అందుకు మీకు అభినందనలు. ఇక్కడ మేము ఏయే పనులు చేశామనేది చెప్పుకోవడం కాకుండా, మీరు స్వయంగా చూడడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది.

రాజ్‌దీప్: సాధారణంగా అన్ని ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలపై ఎక్కువగా వ్యయం చేయవనే విమర్శలు వినిపిస్తుంటాయి. అందుకు భిన్నంగా మీరు ఈ రెండు రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటిని అభివృద్ధి చేసి చూపించాలనుకుంటున్నారా?

సీఎం జగన్ : పేదరిక నిర్మూలనకు నాణ్యతతో కూడిన విద్య అనేది కీలకమని నేను గట్టిగా నమ్ముతాను. విద్యా హక్కు అనేది ఇంకా నినాదంగా మిగలకూడదు. నాణ్యతతో కూడిన విద్య అనేది హక్కుగా మారాలి. నిరుపేదలు ఒక చదువుకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు వేరే చదువులు చదువుతున్నారు. నిరుపేద పిల్లలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవడం, అది కూడా కేవలం తెలుగు మీడియంలోనే చదవడం.. మరోవైపు ధనికులైన పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదవడం సరికాదు. నిరుపేదలు, ధనికుల మధ్య కొనసాగుతున్న ఈ వ్యత్యాసం, తేడా తొలగాలి. ధనికుల మాదిరిగా నిరుపేద పిల్లలు కూడా చదవాలి. వారికి ఆ విధంగా విద్యను అందించాలి. ఆ ఆలోచన నుంచి వచ్చినవే ఈ మార్పులు. మా ప్రభుత్వం ఆ దిశలోనే పని చేస్తోంది. నిరుపేద పిల్లలకు కూడా అత్యుత్తమ నాణ్యతతో కూడిన విద్య, ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగాలి.

రాజ్‌దీప్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన, మూడో తరగతి నుంచే గ్లోబల్ విద్య, టోఫెల్‌లో శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే దీనిపై విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి నేత కూడా దీనిపై విమర్శలు చేస్తున్నారు.

సీఎం జగన్: ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిష్ మీడియంలోకి మారుస్తున్నారని విమర్శలు చేస్తున్న వారందరినీ నేను ఒక్కటే అడుగుతున్నాను. వారి పిల్లలు, వారి మన వళ్లు, మనవరాళ్లు ఏ మీడియంలో చదువుతున్నారు? వారిని తెలుగు మీడియం స్కూళ్లకే పంపిస్తున్నారా? అదే నా సూటి ప్రశ్న. ఇంగ్లిష్ మీడియం వైపు నా చొరవను ప్రశ్నించే ముందు.. ముందుగా నా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి.

రాజ్‌దీప్: నిజంగా ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం మధ్య ఉన్న గ్యాప్‌ను అంత సులభంగా మార్చగలరా? దానివల్ల పిల్లలు ఇబ్బంది పడే పరిస్థితి రాదా? వెంకయ్యనాయుడు లాంటి వారికి ఇదే మీ సమాధానమా?

సీఎం జగన్: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఏకపక్షంగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చడం లేదు. ప్రతి ఒక్కటీ ఒక పద్ధతి ప్రకారం, శాస్త్రీయ విధానంలో సాగుతోంది. ఒక సమగ్ర విధానంలో కొనసాగుతోంది. ప్రతి పుస్తకాన్ని బైలింగ్యువల్.. అంటే ఒక పేజీ ఇంగ్లిష్, పక్క పేజీ తెలుగులో ముద్రిస్తున్నాం. ఇంకా బైజూస్ కంటెంట్‌ను కూడా తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్య మార్పులు చేస్తున్నాం. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆరో తరగతి నుంచి, ఆపై తరగతుల్లోని ప్రతి క్లాస్‌రూమ్‌లో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్) ఏర్పాటు చేస్తున్నాం. ఆ మేరకు 62 వేల తరగతులు ఉండగా, ఇప్పటికే 40 వేల తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశాం. మిగిలిన తరగతి గదుల్లో వచ్చే నెల చివరి నాటికి ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఆ విధంగా ఒక ప్రణాళికా బద్ధంగా పాఠశాల విద్యా రంగంలో వినూత్న మార్పుల దిశలో పని చేస్తున్నాం. బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, టీచర్లలో నైపుణ్యం, సామర్థ్యం పెంపు, బైజూస్ కంటెంట్, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల ఏర్పాటు.. ఇలా వీటన్నింటి వల్ల ప్రాథమిక విద్యా రంగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇవన్నీ కాకుండా.. పిల్లలు 8వ తరగతిలోకి వచ్చే సరికి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఇస్తున్నాం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అవినీతి రూ.500 కోట్లు!

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్, మెట్రోరైల్ డైరెక్టర్ శివబాలకృష్ణపై ఏసీబీ దాడులు

సాక్షి, హైదరాబాద్: భవన అనుమతులు, టౌన్‌ప్లానింగ్‌లో అడ్డగోలుగా అవినీతికి పాల్పడి, వందల కోట్లు అక్రమంగా కూడబెట్టిన తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కింది. హైదరాబాద్ నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) మాజీ డైరెక్టర్, ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఆర్ఎంఎల్) డైరెక్టర్‌గా ఉన్న శివబాలకృష్ణ నివాసం, కార్యాలయాలు, ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు బుధవారం విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఆయన తన పదవిని, ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో సన్నిహిత పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా రూ.500 కోట్ల వరకు అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా అంచనా వేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువే బహిరంగ మార్కెట్లో రూ.వంద కోట్లకుపైగానే ఉంటుందని చెప్తున్నారు. ఇంకా నిర్ధారించి, విలువ తేల్చాల్సిన ఆస్తులు భారీగానే ఉన్నాయని అంటున్నారు. హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో శివబాలకృష్ణ భారీగా అవినీతికి పాల్పడి, అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

17 చోట్ల ఏకకాలంలో సోదాలు

శివ బాలకృష్ణ హెచ్ఎండీఏలో భూమార్పిడి వినియోగం, హైరైజ్ భవనాలకు అనుమతులు, కీలకమైన పట్టణ ప్రణాళిక (టౌన్‌ప్లానింగ్)కు సంబంధించిన పోస్టుల్లో పనిచేశారు. ఈ క్రమంలో ఆయన ఉన్నతాధికారుల అండదండలతో కీలక పోస్టుల్లో ఏళ్లతరబడి పాతుకుపోయి భారీగా అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారన్న సమాచారం మేరకు ఏసీబీ దాడులకు దిగింది. అధికారులు బుధవారం ఉదయం హైదరాబాద్ శివార్లలోని పుప్పాలగూడలో ఉన్న శివబాలకృష్ణ ఇల్లు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లు కలిసి మొత్తం 17 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఇంట్లో అయితే ఏకంగా 20 మంది అధికారులు అన్ని మూలలా జల్లెడపట్టినట్టు తెలిసింది. ఈ సందర్భంగా భారీగా స్థిర, చరాస్తులను గుర్తించారు. పెద్ద సంఖ్యలో ప్లాట్లు, ఫ్లాట్లు, బినామీల పేరిట పెట్టిన ఇతర స్థిరాస్తుల డాక్యుమెంట్లు, రూ.40 లక్షల నగదు, భారీగా బంగారు, వజ్రాభరణాలు, వెండి, పదిహేను వరకు ఐఫోన్‌లు, పదుల సంఖ్యలో వాచ్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఆయనకు పెద్ద సంఖ్యలో బ్యాంకు లాకర్లు ఉన్నట్టు సమాచారం. వాటిని తెరిస్తే మరింత భారీగా ఆస్తుల బయటపడవచ్చని ఏసీబీ అధికారులు చెప్తున్నారు. గురువారం కూడా సోదాలు జరిపే అవకాశం ఉందని, తనిఖీలు పూర్తయ్యే సరికి ఆస్తుల బహిరంగ మార్కెట్ విలువ రూ.500 కోట్ల వరకు తేలవచ్చని అంటున్నారు.

సహకరించని కుటుంబ సభ్యులు, బంధువులు

ఏసీబీ అధికారులు సోదాలు చేసిన సమయంలో శివ బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు ఏమాత్రం సహకరించలేదని అధికారులు అంటున్నారు. బినామీ ఆస్తుల పత్రాలకు సంబంధించి ప్రశ్నిస్తే శివ బాలకృష్ణ సమాధానం ఇవ్వనట్టు తెలిసింది. ఆయన కారును కూడా అధికారులు క్షుణ్నంగా తనిఖీ చేశారు. శివబాలకృష్ణ పెద్ద ఎత్తున పెండింగ్ ఫైల్స్‌ను పురపాలక శాఖ ఉన్నతాధికారి అండదండలతో క్లియర్ చేశారని.. పలు నిర్మాణ సంస్థల యజమానుల నుంచి భారీగా సొమ్ము తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. శివ బాలకృష్ణ వ్యవహారశైలితో నష్టపోయిన కొందరు బిల్డర్లు ఏసీబీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఆయనపై ఏసీబీ దాడి నేపథ్యంలో కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో ఆందోళన కనిపిస్తోంది.

బ్యాంకు లాకర్లను తెరవాల్సి ఉంది

ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు ఫిర్యాదులు అందడంతో శివబాలకృష్ణపై దాడులు చేపట్టినట్టు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర బుధవారం సాయంత్రం వెల్లడించారు. ''బాలకృష్ణ 2018–2023 మధ్య హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా కొనసాగారు. మొత్తం 17 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నాం. భారీ ఎత్తున అతి విలువైన భూముల పత్రాలు దొరికాయి. అవన్నీ బినామీల పేరిట కొనుగోలు చేశారు. వాటిని పరిశీలిస్తున్నాం. బాలకృష్ణ ఇంట్లో రూ.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. బుధవారం అర్ధరాత్రి వరకు, అవసరమైతే గురువారం కూడా సోదాలు కొనసాగిస్తాం. ఇంకా బ్యాంకు లాకర్లను పరిశీలించాల్సి ఉంది..''అని ఏసీబీ డీజీ తెలిపారు. శివ బాలకృష్ణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశామని, గురువారం ఏసీబీ కోర్టు ముందు ప్రవేశపెడతామని తెలిపారు.



సోదాలు చేస్తున్న అధికారులు

ఓ సీనియర్ ఐఏఎస్ భాగస్వామ్యంపై ఆరా!

శివబాలకృష్ణ ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో సన్నిహితంగా మెలిగారని, ఆయన కనుసన్నల్లో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. సదరు ఐఏఎస్ అధికారికి ఈ అవినీతిలో భాగస్వామ్యం పైనా ఆరా తీస్తున్నట్టు చెప్తున్నారు. పురపాలక శాఖలోని అధికారులు సైతం.. సదరు సీనియర్ ఐఏఎస్ అధికారి లక్ష్యంగా దాడులు జరిగాయని చర్చించుకుంటున్నారు. శివబాలకృష్ణ భారీగా ముడుపులు తీసుకోవడమేకాక, కొందరి నుంచి ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్టుగా ఏసీబీ అధికారులకు కచ్చితమైన సమాచారం లభించిందని.. ఈ క్రమంలోనే దాడులు జరిగాయని అంటున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను కొత్త సర్కారు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా నియమించాక ఈ కేసుపై ఫోకస్ పెట్టడం గమనార్హం.

ఇదేమి రాజ్యం..?

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. హైకోర్టుకు భూకేటాయింపు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం వర్సిటీలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద చేపట్టిన ఆందోళనకు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ హాజరయ్యారు. ఆందోళన విషయం తెలిసిన రాజేంద్రనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని, నిరసన తెలుపుతున్నవారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఝాన్సీ పోలీసుల నుంచి తప్పించుకుని ముందుకు పరుగెత్తారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు.. ఝాన్సీ జుట్టుపట్టుకుని లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె కిందపడిపోయింది. చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు ఝాన్సీతోపాటు 15 మంది ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు.

కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలంటూ..

ఆందోళన సమయంలో ఝాన్సీని పోలీసులు జుట్టు పట్టి లాగడం, ఆమె కిందపడిపోవడాన్ని అక్కడే ఉన్న కొందరు విద్యార్థులు వీడియో తీశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న బీజేపీ, ఏబీవీపీ నాయకులు.. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఝాన్సీని పరామర్శించారు. దురుసుగా ప్రవర్తించిన మహిళా కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం డీజీపీని, హైదరాబాద్ సీపీని కలసి దీనిపై వినతిపత్రం అందిస్తామని వెల్లడించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నేతలపై పోలీసులు దుశ్చర్యలకు పాల్పడడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

జాతీయస్థాయి పోటీలకు 'ఏకలవ్య' విద్యార్థి



మనోజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ

టేకులపల్లి: టేకులపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి మనోజ్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యాన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు అండర్–14 బాలుర విభాగంలో తృతీయ స్థానం సాధించింది. ఈ జట్టులో ప్రతిభ కనబర్చిన మనోజ్‌ను ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ భద్రయ్య, పీఈటీ మహేష్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

పెద్దమ్మతల్లికి వెండివస్తువుల బహూకరణ



వెండి వస్తువులు అందజేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన పెద్దమ్మతల్లి అమ్మవారికి రూ.43వేల విలువైన 515 గ్రాముల వెండి వస్తువులను భక్తులు బహూకరించారు. పాల్వంచ కాంట్రాక్టర్ల కాలనీకి చెందిన కిలారు లాలమ్మ పూజలో ఉపయోగించే వెండిశఠారి, తీర్థపు పాత్ర, ప్లేట్‌ను బుధవారం అందజేశారని ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు.

సాగర్ కాల్వకు నీరు విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రైతు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు కలిసి మాట్లాడారు. ఆయకట్టుకింద పొలాలు పొట్ట దశకు చేరిన నేపథ్యాన పది రోజుల పాటు నీరు విడుదల చేయాలని కోరారు. మంత్రిని కలిసిన బృందంలో నాయకులు సాగర్, శోభన్‌నాయక్, ఎస్.నవీన్‌రెడ్డి, రాయల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఈ ఆనకట్టకు 158 ఏళ్ల చరిత్ర!

- అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా అవకాశం
- నేడు ఎన్నో ప్రాజెక్టులకు ఇదే ఆధారం
- ప్రతిపాదనల్లోనే దుమ్ముగూడెం ఆనకట్ట ప్రాంత అభివృద్ధి



అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద గోదావరిపై ఆనకట్ట

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని కుమ్మరిగూడెం వద్ద గోదావరి నదిపై అశ్వాపురం – దుమ్ముగూడెం మండలాలను కలుపుతూ 1865వ సంవత్సరంలో సర్ ఆర్థర్ కాటన్ దుమ్ముగూడెం ఆనకట్ట నిర్మించారు. ఘన చరిత్ర కలిగిన దుమ్ముగూడెం ఆనకట్ట ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నా ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఆనకట్ట ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉండగా... ఏనాటికైనా పర్యాటకంగా తీర్చిదిద్దకపోతారా అని స్థానికులే కాకుండా జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికే బారులు

ఏటా వర్షాకాలంలో పాటు ఇతర సమయాల్లో కూడా ఆనకట్ట అందాలను చూడడానికి పినపాక, భద్రాచలం, కొత్తగూడెంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. అలాగే, సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనుల పరిశీలనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు వచ్చివెళ్తున్నారు. అయినా దట్టమైన అడవిని తలపించే ఆనకట్ట ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ విషయంలో చొరవ చూపి ఏళ్ల చరిత్ర కలిగిన దుమ్ముగూడెం ఆనకట్ట ప్రాంతాన్ని పర్యాటకంగా ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నో ప్రాజెక్టులకు ఆధారం

దుమ్ముగూడెం ఆనకట్టను ఆధారంగా చేసుకుని పాలకులు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. దుమ్ముగూడెం ఆనకట్ట ఆధారంగా గతంలో కేంద్ర ప్రభుత్వం భారజల కర్మాగారాన్ని నిర్మించింది. ఆనకట్టకు సమీపంలో నిర్మించిన ఇన్ టేక్‌వెల్ ద్వారా భారజల కర్మాగారానికి నీరు సేకరించి అక్కడ భారజలంగా మారుస్తున్నారు. అలాగే, కుమ్మరిగూడెం, పాములపల్లి గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలు నిర్మించగా వీటి కింద వందల ఎకరాల భూములు సాగవుతున్నాయి. ఇక్కడి నుంచే ఇన్ టేక్‌వెల్ ద్వారా మిషన్ భగీరథ కింద భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని 22 మండలాల ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఇదే ఆనకట్టను ఆధారం చేసుకుని రాజీవ్‌సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు సిద్ధమైంది. అలాగే, దుమ్ముగూడెం ఆనకట్ట దిగువన 37 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. జల విద్యుత్ కేంద్రం నిర్మాణానికి సైతం ప్రతిపాదించారు. అయితే, పర్యావరణ అనుమతుల కారణంగా ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

ఇక వేసవిలో అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల ప్రజలకు ఇదే ఆనకట్ట వారధిగా పనిచేస్తుండగా.. వర్షాకాలంలో ఆనకట్ట పైనుంచి నీరు పొంగిపొర్లుతూ, శీతాకాలంలో నీరు జాలువారుతూ పర్యాటకులను ఆకట్టుకునేలా ఉంటుంది. కాగా, ప్రస్తుత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ పనుల వేగవంతంపై దృష్టి సారించింది. దీంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తుండగా బ్యారేజీ, ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఆయుధాల కోసమే ధర్మారం క్యాంపుపై దాడి?

ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 16న మావోయిస్టుల దాడిపై అనుమానాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రాకెట్ లాంచర్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని ధర్మారంలో ఉన్న సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపుపై మావోయిస్టులు ఆయుధాలు సహా ఇతర సామగ్రిని లూటీ చేయడానికే దాడి చేశారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టులు ఈ నెల 16న రాత్రి బీజాపూర్ జిల్లాలోని క్యాంపుతో పాటు సమీపాన చింతవాగు ఒడ్డున ఉన్న చింతవాగు క్యాంపు, పామేడు పోలీస్‌స్టేషన్లపై ఏకకాలంలో దాడి చేశారు. ఈ దాడిలో నిష్ణాతులైన 300 మందికి పైగా మావోయిస్టులతో పాటు సాధారణ మావోయిస్టులు పెద్దసంఖ్యలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. క్యాంపును లూటీ చేసేందుకే ఈ తరహా దాడికి దిగినట్లు సమాచారం. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ధర్మారం క్యాంపును చుట్టుముట్టడంతో పాటు కొందరు మావోయిస్టులు చెట్ల ఆకులు, అడవిగడ్డితో తయారు చేసిన దుస్తులను ధరించి జవాన్లపై కాల్పులు జరుపుతూ ఆయుధాలు అపహరించాలనే యత్నం చేసినా బలగాలు దీటుగా తిప్పికొట్టడంతో మావోల ప్రయత్నం ఫలించలేదు. ఈ ఘటనకు సంబంధించి మావోయిస్టులు చేస్తున్న ఆరోపణలను సీఆర్పీఎఫ్ అధికారులు కొట్టిపారేస్తున్నారు. మావోయిస్టులకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకునేందుకు పోలీసులే చనిపోయారంటూ తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని, తమవైపు ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. అంతేకాక ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లుగా వారే ప్రకటించారని చెబుతున్నారు. కాగా, మావోయిస్టులు క్యాంపుల పైకి విసిరిన సుమారు 300 రాకెట్ లాంచర్లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: సుదీర్ఘకాలం తర్వాత ఖమ్మంలో రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం నుంచి పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని టోర్నీ కార్యదర్శి ఎం.డీ.మతిన్ తెలిపారు. స్టేడియంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ చాంపియన్ షిప్‌గా 1992లో టోర్నీ ప్రారంభం కాగా, మధ్యలో తొమ్మిదేళ్లు నిర్వహించలేకపోయామని చెప్పారు. మళ్లీ ఈసారి పోటీలు నిర్వహిస్తుండగా ఉమ్మడి జిల్లా స్థాయిలో 16జట్లు పాల్గొననున్నాయని తెలిపారు. పోటీల్లో విజేతకు పి.బాబురావు స్మారకార్థం రోలింగ్ ట్రోఫీ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి, సీనియర్ క్రికెటర్ వెంకట్‌ప్రసాద్‌తో పాటు నరాల నరేష్, అన్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి సాగుతో రైతు, కూలీలకు ఉపాధి

- రైతులకు అండగా నిలిచేలా యువతకు శిక్షణ
- ఏపీ కొబ్బరి బోర్డు డీడీ కుమార్ వేల్



మాట్లాడుతున్న కొబ్బరి బోర్డు డీడీ కుమార్ వేల్, పక్కన ప్రొఫెసర్లు

అశ్వారావుపేటరూరల్: కొబ్బరిసాగుతో రైతులు, వాటి ఉత్పత్తులతో కూలీలకు ఉపాధి లభిస్తుందని ఏపీ కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్ తెలిపారు. ఈనేపథ్యాన రైతులకు అండగా నిలిచేలా వృక్షమిత్ర పేరిట నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో కొబ్బరి అభివృద్ధి బోర్డు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యాన ఆరు రోజులపాటు జరిగే వృక్షమిత్రల శిక్షణను బుధవారం డీడీ ప్రారంభించి మాట్లాడారు. ఇరవై మంది నిరుద్యోగ యువకులకు కొబ్బరి కాయలు కోసే విధానం, చెట్లు ఎక్కే యంత్రాల వినియోగం, చెట్లకు ఆశించే చీడపీడల నివారణపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వృక్షమిత్ర పేరిట నిర్వహించే ఈ శిక్షణ మాస్టర్ ట్రెయినీల ఆధ్వర్యాన కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం, కొబ్బరి బోర్డు ద్వారా అందిస్తున్న సబ్సిడీ పథకాలను వివరించారు. ఆతర్వాతకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత కుమార్ మాట్లాడుతూ స్థానికంగా కొబ్బరిసాగు పెరిగేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఐవీ.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, శ్రావణ్‌కుమార్, రమేష్, కోటేశ్వర్, ఝాన్సీ రాణి, జంబమ్మ, మాస్టర్ ట్రెయినీలు రఘు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ మద్దతు ధర పెంపునకు కృషి చేయండి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

దమ్మపేట: కేంద్రప్రభుత్వం పామాయిల్ దిగుమతిపై పన్ను తగ్గించడంతో ధర తగ్గి రైతులు నష్టపోతున్న నేపథ్యాన మద్దతు ధర పెంచేలా కృషి చేయాలని ఏపీకి చెందిన ఆయిల్‌పామ్ రైతులు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో మంత్రిని కలిసిన ఆయిల్‌పామ్ రైతులు పలు సమస్యలను విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతిపై పన్ను తగ్గించిన కారణంగా పామాయిల్ ధర తగ్గి తమకు నష్టం జరుగుతోందని తెలిపారు. ఈ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సంయుక్తంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో పాటు ఆయిల్‌పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు అలపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా స్థాయి టోర్నీలో పతకాలు



క్రీడాకారులను సన్మానిస్తున్న జీఎం శాలెం రాజు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా స్థాయిలో జరిగిన హాకీ టోర్నీతో పాటు నాగ్‌పూర్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సింగరేణి కొత్తగూడెం ఏరియా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈసందర్భంగా క్రీడాకారులు ఎస్.కే.గులాం. గౌస్, రాజ్‌కుమార్, అజ్మీరా మహేష్, శ్రీనివాస్‌రెడ్డిని ఏరియా జీఎం ఎం.శాలేంరాజు బుధవారం సన్మానించి మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ సంస్థకు పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, క్రీడాకారులు కోటిరెడ్డి, ఎస్.యోహాన్, శివకేశవరావు, శ్రావణ్‌కుమార్, ఎస్.సదానందం, టి.సత్యనారాయణ, బి.తావుర్యా, మజ్జి మురళి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.